

ఇబ్రహీంపట్నం నుంచి రాయపోల్ మీదుగా తూప్రాన్‌పేట్ వరకు పూర్తైన రోడ్డు విస్తరణ పనులు

# సాఫీగా ప్రయాణం

- తెలంగాణ రాష్ట్రంలో మారిన రోడ్ల రూపురేఖలు
- రూ.684 కోట్లతో 33 రోడ్ల విస్తరణ, మరమ్మతులు
- రోడ్ల అనుసంధానంతో సుఖవంతమైన ప్రయాణం

## నాడు అధ్వానం.. నేడు అద్భుతం

ఇబ్రహీంపట్నం, నవంబర్ 2: నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రోడ్లు గత ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో ఎంతో అధ్వానంగా ఉండేవి. గ్రామాల కు గ్రామాలకు మధ్య లింకురోడ్లు లేకపోవటంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. ఏండ్లు గడిచినా రోడ్లు మరమ్మతులకు నోచుకోక రవాణా సౌకర్యం అస్తవ్యస్తంగా ఉం డేది. కానీ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత తొమ్మిదిన్నరేండ్లలో నియోజకవర్గ రూపురేఖలు ఎంతో మారాయి. సీఎం కేసీఆర్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రోడ్లు విశాలంగా, అద్భుతంగా మారడంతోపాటు గ్రామాలకు కూడా రవాణా సౌకర్యం మెరుగుపడింది. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రధానమైన 33 రోడ్లను రూ.684 కోట్లతో వెడల్పుచేశారు. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-నాగార్జునసాగర్, హైదరాబాద్-శ్రీశైలం రోడ్లతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రవాణా సౌకర్యాన్ని అనుసంధానం చేశారు. వెడల్పు చేసిన రోడ్లకు ఇరువైపులా ఉన్న భూముల ధరలు గణనీయంగా పెరగటంతోపాటు పెద్ద ఎత్తున పరిశ్రమలు కూడా వెలుస్తున్నాయి. దీంతో నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి గత ఉమ్మడి ప్రభుత్వాల పాలకులు.. ప్రస్తుత బీఆర్ఎస్ పాలనలో స్పష్టమైన మార్పు కనిపిస్తున్నది. ముఖ్యంగా హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారి ఇరుకుగా ఉండటం తో పెరిగిన వాహనాల సంఖ్యకు ఏ మాత్రం సరిపోలేదు. అం తే కాకుండా ఇబ్రహీంపట్నం ప్రాంతంలో పెద్ద ఎత్తున విద్యాసంస్థలు, రక్షణరంగ, వ్యాపార సంస్థలు అధిక సంఖ్యలో ఏర్పాటయ్యాయి. దీంతో ప్రతిరోజూ నగరం నుంచి ఇబ్రహీంపట్నానికి వేలాది ఇంజినీరింగ్ కళాశాలల బస్సులతోపాటు ఇతర వాణిజ్య, వ్యాపారాలకు వచ్చే వాహనాలతో నాగార్జునసాగర్ రహదారి ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతుండేది. దీంతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని బీఎన్‌రెడ్డినగర్ నుంచి ఖానాపూర్ వరకు సాగర్ రహదారిని రూ.50 నుంచి 60 కోట్లతో నాలుగు లేన్లుగా మార్చడంతోపాటు మధ్యలో డివైడర్లు, సెంట్రల్‌లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో సాగర్ రహదారిపై ప్రయాణం సాఫీగా సాగుతున్నది. ఈ రోడ్డు విస్తరణ జరగటంతో సాగర్ రహదారికిరువైపులా ఉన్న భూముల ధరలు రూ. కోట్లకు చేరాయి. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ పనులు పూర్తికావటంతో పెట్టుబడిదారులు సైతం ఈ సెగ్మెంట్‌పైనే దృష్టి సారిస్తున్నారు.

### రూ.684 కోట్లతో 33 రోడ్ల విస్తరణ..

నియోజకవర్గంలో 33 ప్రధాన రోడ్లను రూ.684 కోట్లతో వెడల్పు చేశారు. ఇందులో ప్రధానమైనవి...

- సాగర్ రహదారి బీఎన్‌రెడ్డినగర్ నుంచి ఖానాపూర్ గేటు వరకు రూ.50 నుంచి రూ.60కోట్లతో నాలుగు లేన్ల రోడ్డుతోపాటు డివైడర్, సెంట్రల్‌లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు.
- సాగర్ రోడ్డులోని కర్ణంగూడ ఎక్స్‌రోడ్డు నుంచి కర్ణంగూడ, ఎలిమినేడు, పోచారం, మంగల్‌పల్లి, పటేల్‌గూడ మీదుగా బొంగుళూరు సాగర్ రహదారిని రూ.68 కోట్లతో అనుసంధానం చేస్తూ డబుల్‌రోడ్డుగా మార్చారు. ఈ రోడ్డులో పలుచోట్ల అధ్వానంగా ఉన్న కల్వర్టులనూ మరమ్మతులు చేశారు. ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు నీరొచ్చే జక్కమ్మకుంట వద్ద వంతెన, పెద్ద చెరువులోకి నీరొచ్చే ప్రధానకాల్వపై మరో వంతెనను ఎలిమినేడు వద్ద నిర్మించారు.
- హైదరాబాద్, విజయవాడ రహదారిలోని సంఘీనగర్ మీదుగా అనాజ్‌పూర్, పోల్కంపల్లి, నాగన్‌పల్లి గ్రామాల మీదుగా ఇబ్రహీంపట్నం వరకు ఉన్న సింగిల్‌రోడ్డును రూ.32 కోట్లతో డబుల్‌రోడ్డుగా మార్చారు.
- నాగార్జునసాగర్ రహదారిలోని గున్‌గల్ నుంచి లోయపల్లి వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. గతంలో ఉన్న సింగిల్‌రోడ్డును రూ.16కోట్లతో డబుల్‌రోడ్డు గామార్చారు.

ఇబ్రహీంపట్నం నుంచి రాయపోల్, ముకునూరు, దండుమైలారం మీదుగా తూప్రాన్ పేట్ విజయవాడ జాతీయ రహదారి వరకు రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చారు. అలాగే, ఇబ్రహీంపట్నం నుంచి మంచాల మండల కేంద్రం మీదుగా ఆరుట్ల ఎక్స్ రోడ్డు నుంచి రంగాపూర్ వరకు ఉన్న రోడ్డును రెండులేన్లుగా మార్చారు.

- ఆగాపల్లి నుంచి తులేకలాన్, రాచులూరు మీదుగా శ్రీశైలం రహదారి వరకు ఉన్న సింగిల్‌రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చారు.
- యాచారం మండల కేంద్రం నుంచి నందివనపర్తి నజ్దిక్ సింగారం మీదుగా కందుకూరు వరకు ఉన్న సింగిల్‌రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చారు.

### మున్సిపాలిటీల్లో అద్దంలా రోడ్లు..

నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీల్లో మిషన్ భగీరథ కింద రోడ్లను తవ్వటంతో అధ్వానంగా మారాయి. ఈ రోడ్లకు మరమ్మతులు చేయడంతో అద్దంలా మెరుస్తున్నాయి. మున్సిపాలిటీల్లో గతంలో ఇరుకుగా, అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు విస్తరణకు నోచుకోవటంతోపాటు సీసీ రోడ్లుగా మారాయి.



విస్తరణ పూర్తైన ఇబ్రహీంపట్నం నుంచి ఎలిమినేడు, పోచారం రోడ్డు



### అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లు..

గత ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో సీసీ రోడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లను నిర్మించడంతో ఇప్పుడు గ్రామం చాలా మంచిగా కనిపిస్తున్నది. ఇంటింటికీ ప్రతిరోజూ శుద్ధి చేసిన తాగునీరు అందుతున్నది. గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించ డం తోపాటు అన్ని వసతులను కల్పించింది.

**-రాములు, ఖాజీఅహ్మద్‌పల్లి**



### ఎమ్మెల్యే కృషితోనే గ్రామాభివృద్ధి..

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కృషితోనే గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నది. కొత్త గ్రామ పంచాయతీ అయినప్పటికీ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అడిగిన వెంటనే నిధులను కేటాయిస్తున్నారు. ఇప్పటికే పంచాయతీ భవన నిర్మాణంతోపాటు అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్ల నిర్మాణం పూర్తైంది. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు.

**-కాశప్ప, ఖాజాఅహ్మద్‌పల్లి**

### బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న ప్రయాణ కష్టాలు..

చిట్లపల్లి నుంచి ఖాజీఅహ్మద్‌పల్లి గ్రామం మధ్యలో ఉన్న వాగు వానకాలంలో పొంగిపొర్లితే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేందని.. అంతేకాకుండా వాగు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందేవారిమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తమ కష్టాలను స్వయంగా తెలుసుకుని వంతెన నిర్మాణం కోసం రూ. 40 లక్షలు మంజూరు చేయించడంతోపాటు పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకున్నారని సర్పంచ్ తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తి కావడంతో వానకాలంలో ఎలంటి ఇబ్బందులు ఉండవని.. ఇక ప్రయాణం సాఫీగా సాగుతుందని సర్పంచ్, గ్రామస్తులు పేర్కొంటున్నారు.



ఇటీవల పూర్తైన బ్రిడ్జి నిర్మాణం

# ప్రతి వీధికీ సీసీ రోడ్డు

- రూ. 35లక్షలతో ఏర్పాటు
- రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం
- రూ.26 లక్షలతో చురుగ్గా సాగుతున్న 'మన ఊరు-మన బడి' పనులు
- ఇంటింటికీ మిషన్ భగీరథ నీటి సరఫరా
- గ్రామస్తుల హర్షం

**ప్రగతిపథంలో ఖాజాఅహ్మద్‌పల్లి**

కొడంగల్, నవంబర్ 2: బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పల్లెలు, తండాలు అభి వృద్ధిలో దూసుకుపోతున్నాయి. ఒక్కప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామా ల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లెప్రగతి కార్యక్రమం కింద కేటాయిస్తున్న నిధులతో ప్రగతి పరుగులు పెడుతున్నది. మండలంలోని ఖాజాఅహ్మద్‌పల్లి నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీ. అప్పట్లో చిట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోకుండా మురుగు దొడ్లు, ఎక్కడబడితే అక్కడ చెత్త కుప్పలు అన్నట్లుగా ఉండేది. నేడు ఆ చెత్త కుప్పలు, మురికి కుంటలు మాయమై గ్రామంలోని రోడ్లు స్వచ్ఛతను మారుపేరుగా నిలిచాయి. మూడేండ్ల క్రితం పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి నీడతోపాటు స్వచ్ఛమైన గాలిని ఇస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. పల్లెప్రగతి నిధులతో గ్రామంలో వైకుంఠధామంతోపాటు అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లను నిర్మించగా అవి కళకళలాడుతున్నాయి. ఇంటింటికీ మిషన్ భగీరథ పథకం క్రింద నల్లా కనెక్షన్లు ఇవ్వడంతో శుద్ధి చేసిన తాగునీరు ఇంటి ముందుకే వస్తున్నదని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పడిన ఖాజాఅహ్మద్‌పల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేయగా పనులు పూర్తై ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అదేవిధంగా గ్రామంలోని పలు వీధుల్లో రూ.35 లక్షలతో సీసీ రోడ్లను ఏర్పాటు చేశారు. కొత్త పంచాయతీకి త్వరగా నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



గ్రామంలోని ఓ వీధిలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

### పాఠశాలలో చురుగ్గా సాగుతున్న పనులు

గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకుని పిల్లల చదువు భయంభయంగా సాగేది. ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని అమలు చేయడంతో పాఠశాల కంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.13 లక్షలు, పాఠశాల మరమ్మతులకు మరో రూ.13 లక్షలు మంజూరు కావడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. 'మన ఊరు-మన బడి'తో మరుగుదొడ్లు, కంపౌండ్‌వాల్ వంటి పూర్తి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్లు విద్యార్థులు పేర్కొంటున్నారు.

